
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 5 | ఫిబ్రవరి | 2026 ◆ పేజీలు : 8



5 లో




### కార్పొరేషన్ ఎన్నికలలో..
# కాంగ్రెస్ సిత్రాలు
(53 వ డివిజన్)

● టికెట్లలో 'కొత్త ముఖాల' కటాక్షం ● ఏళ్లుగా పార్టీని నమ్ముకున్న వారికి దక్కని సీట్లు ● ఫిరాయింపుదారులకు ప్రాధాన్యం.. కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ల కేటాయింపు రోజురోజుకీ వివాదాస్పదంగా మారుతోంది. సర్వే పేరిట ఆ పార్టీ నాయకులూ నడిపిన టికెట్ల కేటాయింపు స్క్రీన్ ప్లే తీరే ఇప్పుడు ఆ పార్టీ సిత్రాలను బయటపెడుతూ, కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తిని రగిలిస్తోంది. నిన్న ప్రచురితమైన "సర్వేనా.. స్క్రీన్ ప్లేనా..?" కథనానికి కొనసాగింపుగా.. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చోటుచేసుకున్న పరిణామాలు పార్టీ శ్రేణుల్లో తీవ్ర కలకలాన్ని రేపుతున్నాయి. ముఖ్యంగా ఏళ్ల తరబడి కాంగ్రెస్ ను నమ్ముకుని పనిచేసిన ఆశావహులను పక్కనపెట్టి, ఇటీవలే ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి టికెట్లు కేటాయించడమే ఇప్పుడు ప్రధాన అసంతృప్తికి కారణంగా మారింది.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి



2 లో..

### సింగరేణి భవిష్యత్ కు..
# ప్రభుత్వం కసరత్తు

● విస్తరణ దశలో కీలక నిర్ణయాల సమయం ● గ్రీన్, ఖనిజ ప్రణాళికలపై ప్రత్యేక దృష్టి ● నాయకత్వ ఖాళీతో నిర్ణయాలకు ఆలస్యం ● పరిపాలనా స్థిరత్వంపై ప్రభుత్వ దృష్టి ● విస్తరణ పనులకు వేగం తీసుకురావాలన్న లక్ష్యం ● సింగరేణి దిశపై కీలక పరిశీలన..

దేశంలో లాభాల్లో కొనసాగుతున్న ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థలలో ఒకటైన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రస్తుతం కీలక దశలో ఉంది. సంస్థ కేవలం బొగ్గు గనులకే పరిమితం కాకుండా, గ్రీన్ ఎనర్జీ, కీలక ఖనిజాల అన్వేషణ వైపు విస్తరించాలన్న ఆలోచనతో గత కొంత కాలంగా ముందుకు సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా బొగ్గు గని సంస్థను అనేక రంగాలలో విస్తరింపచేసేలా ప్రణాళికను సిద్ధం చేసింది. అయితే గత రెండు నెలలుగా కంపెనీకి పూర్తిస్థాయి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లేకుండానే సంస్థ కొనసాగుతుండటంతో, పరిపాలనా స్థిరత్వం, నిర్ణయాల వేగంపై చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఇన్ చార్జ్ వ్యవస్థలో పరిపాలన కొనసాగుతుండటంతో, కొన్ని కీలక నిర్ణయాలు ఆలస్యం అవుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● సింగరేణి ప్రతినిధి, ప్రజాజ్యోతి

### తరగతి గది నుంచి బయట ప్రపంచాన్ని చూడేలా
## విద్యార్థులను తీర్చిదిద్దాలి
### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



2 లో...



2 లో...

## అప్రమత్తతతో బాలుడి భవిష్యత్తు కాపాడిన కానిస్టేబుల్ భార్య

• రాష్ట్ర ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీపీ, ఐజీ చేతుల మీదుగా సత్కారం
• రూ.10 వేల నగదు పురస్కారంతో రాష్ట్ర స్థాయి సన్మానం

## అత్యున్నత న్యాయస్థానాల తీర్పుల్లో భద్రాద్రి వాసి పరిశోధనకు గౌరవం

• హర్షం వ్యక్తం చేసిన బార్ ప్రెసిడెంట్ కోట దేవదానం



**భద్రాచలం, ఫిబ్రవరి 4, ప్రజాజ్యోతి :** మెట్ పల్లి సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావు చేసిన న్యాయ పరిశోధనకు అత్యున్నత న్యాయస్థానాల నుంచి గుర్తింపు లభించడం భద్రాద్రి వాసిగా అరుదైన గౌరవమని భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోట దేవదానం అన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు ,అలహాబాద్ హైకోర్టు వెలువరించిన కీలక తీర్పుల్లో ఆయన న్యాయ పరిశోధనను

మిగతా 2 లో...

## తరగతి గది నుంచి బయట ప్రపంచాన్ని చూడేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి ..

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**పాల్వంచ, ఫిబ్రవరి 4, ప్రజాజ్యోతి** తరగతి గదిలో పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, బయట ప్రపంచంలో ఎదురయ్యే అనేక సమస్యలకు పరిష్కారాలు ఆలోచించే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయడం ద్వారా తమ ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకురావాలంటే ఉపాధ్యాయుల ప్రోత్సాహం కీలకమని ఆయన తెలిపారు, భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పాల్వంచలోని స్థానిక అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు మూడు రోజులపాటు నిర్వహించనున్న "ఇన్నోవేషన్, డిజైన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్" బూట్ క్యాంప్ ను బుధవారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు నిత్యజీవితంలో ఎదుర్కొనేసమస్యలను గుర్తించి, వాటికి పరిష్కారాలు చూపేలా ప్రాజెక్టులు రూపొందించేందుకు ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. అలాంటి ప్రాజెక్టులను ఉత్పత్తుల రూపంలోకి తీసుకువచ్చే దిశగా విద్యార్థులను ప్రోత్సహించేలా ఈ బూట్ క్యాంప్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ బూట్ క్యాంప్ ద్వారా ఉపాధ్యాయులు పొందిన జ్ఞానం, అనుభవాలను తరగతి గదిలో విద్యార్థులకు అందించి, వారి సృజనాత్మక ఆలోచనలు, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు రూపొందించిన నవకల్పనలను ఉత్పత్తులుగా అభివృద్ధి చేయడంలో వాద్వానీ ఫౌండేషన్, భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ, పీఎం శ్రీ పాఠశాలలు భాగస్వాములుగా వ్యవహరించి విద్యార్థులను ప్రోత్సహించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి నుండి విభం వ్యాస్, వాద్వానీ ఫౌండేషన్ నుండి శ్యామ్, డాక్టర్ హెచ్. శ్రీనివాస్ వరప్రసాద్, అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ భరత్ కృష్ణ, ప్రిన్సిపాల్ రవికుమార్, జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజశేఖర్ తో పాటు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల నుండి పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అత్యున్నత న్యాయస్థానాల తీర్పుల్లో భద్రాద్రి వాసి పరిశోధనకు గౌరవం

(మొదటి పేజీ తరువాయి... )

ఉదాహరణగా ప్రస్తావించడం భద్రాచలం ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. పోలీసుల తదుపరి విచారణలో పాటించాల్సిన చట్టపరమైన విధానాలపై నాగేశ్వరరావు చేసిన లోతైన న్యాయ అధ్యయనాన్ని గుర్తించి, అత్యున్నత న్యాయస్థానాలు తమ తీర్పుల్లో ప్రస్తావించడం న్యాయవ్యవస్థలో విశేషమైన విషయమని తెలిపారు. ఇది న్యాయ పరిశోధనకు ఉన్న ప్రాముఖ్యతను మరింత స్పష్టం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కోట దేవదానం మాట్లాడుతూ, నాగేశ్వరరావు మంథని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ గా పనిచేసిన సమయంలో పోలీసుల విచారణలో చట్టపరమైన మార్గదర్శకాలపై రూపొందించిన న్యాయ పరిశోధన అంశాలను సుప్రీంకోర్టు, అలహాబాద్ హైకోర్టులు తమ తీర్పుల్లో ఉదహరించడం న్యాయవ్యవస్థకు గర్వకారణమని అన్నారు. ఇది యువ న్యాయమూర్తులకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. అలాగే భద్రాచలం వాసి అయిన నాగేశ్వరరావు న్యాయ పరిశోధనకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం జిల్లాకు ప్రతిష్టను మరింత పెంచిందని భద్రాచలం న్యాయవాదులు పేర్కొన్నారు . భవిష్యత్తులో కూడా మరిన్ని న్యాయ పరిశోధనలతో న్యాయవ్యవస్థకు సేవలందించాలని ఆకాంక్షించారు

# సింగరేణి భవిష్యత్ కు.. ప్రభుత్వం కసరత్తు



**సింగరేణి ప్రతినిధి, ఫిబ్రవరి 04, ప్రజా జ్యోతి :** దేశంలో లాభాల్లో కొనసాగుతున్న ప్రధాన ప్రభుత్వరంగ సంస్థలలో ఒకటైన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రస్తుతం కీలక దశలో ఉంది. సంస్థ కేవలం బొగ్గు గనులకే పరిమితం కాకుండా, గ్రీన్ ఎనర్జీ, కీలక ఖనిజాల అన్వేషణ వైపు విస్తరించాలన్న ఆలోచనతో గత కొంత కాలంగా ముందుకు సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా బొగ్గు గని సంస్థను అనేక రంగాలలో విస్తరింపచేసేలా ప్రణాళికను సిద్ధం చేసింది. అయితే గత రెండు నెలలుగా కంపెనీకి పూర్తిస్థాయి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లేకుండానే సంస్థ కొనసాగుతుండటంతో, పరిపాలనా స్థిరత్వం, నిర్ణయాల వేగంపై చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఇన్ చార్జ్ వ్యవస్థలో పరిపాలన కొనసాగుతుండటంతో, కొన్ని కీలక నిర్ణయాలు ఆలస్యం అవుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో సింగరేణి భవిష్యత్ దిశా, పరిపాలన అంశాలు, సమర్ధవంత నాయకత్వం పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలుస్తోంది.

### ››› 'కోల్ టు గ్రీన్' మార్పు దిశగా అడుగులు..

136 సంవత్సరాల చరిత్ర గల సింగరేణిని బహుళ రంగాల సంస్థగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు కీలక చర్యలు చేపట్టింది. ప్రపంచవ్యాప్తంగా బొగ్గు వినియోగంపై ఆంక్షలు పెరుగుతున్న నేపథ్యంలో, సింగరేణి కూడా కాలానికి అనుగుణంగా మారాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో 'కోల్ టు గ్రీన్' మార్పును లక్ష్యంగా పెట్టుకుని పునరుత్పాదక శక్తి రంగంలో పెట్టుబడులు పెట్టే దిశగా అడుగులు వేస్తోంది. దీని ద్వారా భవిష్యత్ లో కార్బన్ ఉద్గారాలను తగ్గించడమే కాకుండా సంస్థకు దీర్ఘకాలిక స్థిరత్వం కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దాంతో పాటు బొగ్గుపై ఆధారాన్ని క్రమంగా తగ్గించాలన్న లక్ష్యంతో సింగరేణి గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ను ఏర్పాటు చేసి సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులు ప్రారంభించింది. ఇదే క్రమంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టులపై కూడా ప్రణాళికలు రూపొందిస్తోంది. దీనితో సింగరేణి క్రమంగా ఎనర్జీ రంగంలో తన పాత్రను విస్తరించే దిశగా ముందుకు సాగుతోంది. అదే సమయంలో సింగరేణి విస్తరణలో భాగంగా కీలక ఖనిజాల అన్వేషణపై కూడా దృష్టి సారించింది. ఈ లక్ష్యంతో సింగరేణి గ్లోబల్ లిమిటెడ్ ను ఏర్పాటు చేసి, ఇతర రాష్ట్రాల్లో ఖనిజ అన్వేషణకు అనుమతులు పొందింది. ఇటీవల కర్ణాటకలో బంగారం, రాగి అన్వేషణకు లైసెన్సులు లభించగా, తదుపరి దశలో అన్వేషణ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ప్రయత్నాలతో సంస్థకు కొత్త ఆదాయ మార్గాలు తెరుచుకుంటాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విస్తరణ ప్రణాళికలతో కొత్త ప్రాజెక్టులు ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఉపాధి అవకాశాలు కూడా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇకపై గనులకే పరిమితం కాకుండా ఎనర్జీ, ఖనిజ రంగాల్లో సింగరేణి కార్యకలాపాలు విస్తరించడంతో ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడుతుందని వారు చెబుతున్నారు.

### బలరాం హయాంలో విస్తరణకు రూపకల్పన..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంస్థ విస్తరణపై ప్రకటించిన లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు వెళ్లిన అధికారిగా గత సిఎండి బలరాం గుర్తింపు పొందారు. సింగరేణిని కేవలం బొగ్గు సంస్థగానే కాకుండా, గ్రీన్ ఎనర్జీ, కీలక ఖనిజాల వైపు విస్తరించాలన్న ప్రభుత్వ దృష్టికి అనుగుణంగా పలు ప్రాథమిక నిర్ణయాలు ఆయన హయాంలో తీసుకున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. గ్రీన్ ఎనర్జీపై ప్రత్యేక దృష్టితో సింగరేణి గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఏర్పాటు, కీలక ఖనిజాల అన్వేషణ కోసం సింగరేణి గ్లోబల్ లిమిటెడ్ స్థాపన వంటి నిర్ణయాలు ఈ కాలంలోనే ముందుకు వచ్చాయి. ఇవి పూర్తిస్థాయిలో అమలుకు ఇంకా దూరంగా ఉన్నప్పటికీ, విస్తరణ దిశగా సింగరేణికి ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ ఇచ్చిన నిర్ణయాలుగా భావిస్తున్నారు. అయితే రాష్ట్ర డిప్యూటేషన్ ముగియడంతో డిసెంబర్ 2025 రెండో వారంలో బలరాం సిఎండి పదవిని విడిచిపెట్టాల్సి వచ్చింది. ఆ తర్వాత నుంచి సింగరేణి ఇన్ చార్జ్ వ్యవస్థలో కొనసాగుతోంది. ఈ సమయంలో కొన్ని కీలక నిర్ణయాలు ఆలస్యం కావడం, విస్తరణ ప్రణాళికలు ఆశించిన వేగంతో ముందుకు సాగకపోవడం వంటి అంశాలు చర్చకు వచ్చాయి. ఈ నేపథ్యంలో సింగరేణి పరిపాలనపై పట్టు, గనుల నిర్వహణపై అనుభవం, కేంద్ర–రాష్ట్ర వ్యవహారాలపై అవగాహన ఉన్న అధికారే ఇప్పుడు అవసరమన్న అభిప్రాయం బలపడుతోంది. అదే కారణంతో గతంలో సిఎండిగా పనిచేసిన అనుభవం ఉన్న బలరాంను మళ్లీ ఈ బాధ్యతలకు పరిశీలిస్తున్నట్టు సమాచారం వెలువడుతోంది. అవసరమైతే కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించి డిప్యూటేషన్ ద్వారా మళ్లీ సేవలు పొందే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు వర్గాలు చెబుతున్నాయి.

### ››› సిఎండి ఖాళీతో నిర్ణయాలపై ప్రభావం..

అయితే, ఈ విస్తరణ ప్రణాళికలు పూర్తిస్థాయిలో ముందుకు సాగాలంటే సంస్థలో పరిపాలనా స్థిరత్వం ఇప్పుడు కీలకంగా మారింది. గత రెండు నెలలుగా సింగరేణిలో పూర్తిస్థాయి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లేకపోవడంతో కొన్ని కీలక నిర్ణయాలు ఆశించిన వేగంతో ముందుకు సాగలేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. గత సిఎండి బలరాం పదవీకాలం 05 డిసెంబర్ 2025 నాటికి ముగియడంతో, ఆ స్థానంలో ఇన్ చార్జ్ సిఎండి గా కృష్ణ భాస్కర్ కు బాధ్యతలు అప్పగించారు. అయితే అప్పటికే ఆయన వద్ద ట్రాన్స్ కోతో పాటు మరి కొన్ని కీలక బాధ్యతలు ఉండటంతో, సింగరేణిపై పూర్తి స్థాయి దృష్టి సారించలేకపోయారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో పెద్ద స్థాయి నిర్ణయాలు తీసుకోవడం కష్టమవుతుండటం, కొన్ని పనులు నిలిచిపోవడం, మరికొన్ని ఆలస్యం కావడం జరిగిందని అధికార వర్గాలు చెబుతున్నాయి. తదుపరిగా జరిగిన నాయినీ వివాదంతో సంస్థలో బలమైన నిర్ణయాలు తీసుకోవడం మరింత కష్టంగా మారినట్టు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో ఈ కీలక బాధ్యతను స్వీకరించేందుకు కొందరు సీనియర్ అధికారులు ముందుకు రావడం లేదన్న చర్చ కూడా కొనసాగుతోంది. గతంలో అత్యంత కోరుకున్న పదవిగా భావించిన సిఎండి స్థానం పట్ల ఇటీవల ఆసక్తి తగ్గినట్టు సమాచారం. దీంతో సింగరేణి పరిపాలనపై పట్టు, గనుల నిర్వహణపై అనుభవం, కేంద్ర–రాష్ట్ర వ్యవహారాలపై అవగాహన ఉన్న అధికారి అవసరమన్న భావన ప్రభుత్వ స్థాయిలో బలపడుతోంది. విస్తరణ ప్రణాళికలు, కొత్త ప్రాజెక్టులు సక్రమంగా ముందుకు సాగాలంటే అనుభవజ్ఞుడైన నాయకత్వమే కీలకమన్న అభిప్రాయంలో ప్రభుత్వ పెద్దలు ఉన్నట్టు తెలుస్తోంది.

## అప్రమత్తతతో బాలుడి భవిష్యత్తు కాపాడిన కానిస్టేబుల్ భార్య

- రాష్ట్ర ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీపీ, ఐజీ చేతుల మీదుగా సత్కారం
- రూ.10 వేల నగదు పురస్కారంతో రాష్ట్ర స్థాయి సన్మానం



**దమ్మపేట, ఫిబ్రవరి. 04, (ప్రజా జ్యోతి :** పోలీసు సేవ అనేది యూనిఫామ్ వరకే పరిమితం కాదని, పోలీస్ కుటుంబాల సామాజిక బాధ్యత ఎంత విశాలమో మరో సారి రుజువైంది. దమ్మపేట ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ ఎన్. కృష్ణారావు భార్య లక్ష్మి చూపిన అప్రమత్తత, చొరవ వల్ల ఓ బాలుడు సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేరగా, ఆమెకు రాష్ట్ర స్థాయి గుర్తింపు దక్కింది. ఖమ్మం రూరల్ మండలం పోలిశెట్టిగూడెం గ్రామానికి చెందిన ఓ బాలుడు దమ్మపేట మండలం మందలపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం హాస్టల్ అధికారులకు తెలియకుండా బయటకు వచ్చిన బాలుడు బస్సు ఎక్కగా, అదే బస్సులో ప్రయాణిస్తున్న లక్ష్మి అతడి ఆందోళనను గమనించి పలకరించారు. బాలుడు హాస్టల్ నుంచి పారిపోతున్నట్టు గ్రహించిన ఆమె, ఆలస్యం చేయకుండా తన భర్త కృష్ణారావు ద్వారా పోలీసు అధికారులను, పాఠశాల యాజమాన్యాన్ని అప్రమత్తం చేశారు. బాలుడి తండ్రికి సమాచారం ఇచ్చి ధైర్యం చెప్పిన లక్ష్మి, ఖమ్మం బస్టాండ్ లో పోలీసుల సమక్షంలో బాలుడిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించే వరకు పూర్తి బాధ్యత తీసుకున్నారు. ఈ ఒక్క చొరవతో ఒక కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. లక్ష్మి సేవను గుర్తించిన రాష్ట్ర ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీపీ విజయ్ కుమార్, ఐజీ కార్తికేయ బుధవారం హైదరాబాద్ లోని రాష్ట్ర ఇంటెలిజెన్స్ ప్రధాన కార్యాలయంలో ఆమెను ప్రత్యేకంగా పిలిపించి శాలువాలతో సన్మానించి రూ.10 వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... విధి నిర్వహణలోనే కాదు, సమాజంలోనూ పోలీస్ కుటుంబాలు అప్రమత్తంగా ఉండటం గర్వకారణమని, లక్ష్మి ప్రతి పోలీస్ కుటుంబానికి ఆదర్శమని ప్రశంసించారు.ఈ ఘటనతో ఇంటెలిజెన్స్ శాఖ ప్రతిష్ఠ మరింత పెరిగిందని, ఇలాంటి సామాజిక చొరవలు ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని బలపరుస్తాయని ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు.

# సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యం: పీఓ జనరల్ డేవిడ్ రాజ్

- ఐటీడీఏలో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం నిర్వహణ





**భద్రాచలం, ఫిబ్రవరి 4,ప్రజాజ్యోతి :** తెలంగాణ రాష్ట్రంలో జీవించే ప్రజలందరికీ సమాన హోదా, సమాన అవకాశాలు కల్పించడంతో పాటు సమాజంలో వెనుకబడిన చివరి వ్యక్తికీ తగిన వనరులు, ప్రాతినిధ్యం మరియు ఆత్మ గౌరవం కల్పించే దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు.బుధవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అధికారిక పనులపై వెళ్లి అందుబాటులో లేకపోవడంతో, యూనిట్ అధికారులు మరియు సిబ్బంది సమక్షంలో మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జనరల్ డేవిడ్ రాజ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి మరియు రాజకీయ అంశాలపై కులాల సమగ్ర సర్వే, అలాగే షెడ్యూల్డ్ కులాల ఉపవర్గీకరణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తూ పేద ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించేలా పనిచేస్తోందని తెలిపారు.ఈ హక్కుల సాధన కోసం తమ జీవితాలను ధారపోసిన మహనీయులు మనకు మార్గదర్శకులని అన్నారు. మహాత్మా గాంధీ కలగన్న సర్వోదయ సమాజం, అణగారిన వర్గాలకు విద్య, గౌరవం కోసం మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన పోరాటం, అలాగే భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ బోధించిన సామాజిక ప్రజాస్వామ్య విలువలు మనందరికీ నిరంతర ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు.ప్రగతి అనేది ఒక గమ్యం కాదని, అది నిరంతర సామాజిక న్యాయ పోరాటమని అన్నారు. ప్రతిభకు అవకాశాలు తోడైనప్పుడు కుల, మత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ తమ కలలను సాకారం చేసుకునే సమాజాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపారు. భారత దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామిగా నిలిచేలా సమ్మిళిత భారతావని నిర్మాణానికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.అనంతరం ఐటీడీఏ యూనిట్ అధికారులు, సిబ్బంది కలిసి సామాజిక న్యాయ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పవర్ వేణు, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, పీవీటీజీ అధికారి గన్యా, ఏసీఎంవో రమేష్, ఏవో సున్నం రాంబాబు, డీటీఎల్టీఆర్ నాగేశ్వరరావు, అలాగే వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ సోషల్ జస్టిస్ డే వేడుకలు

- సామాజిక న్యాయం అందరికీ చేరాలన్నదే లక్ష్యం: తహసీల్దార్ గంటా ప్రతాప్





**అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 4,ప్రజాజ్యోతి:** తెలంగాణ సోషల్ జస్టిస్ డే సందర్భంగా అన్నపురెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం, మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల తహసీల్దార్ గంటా ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమ ప్రారంభంలో మహాత్మా గాంధీ, డా. బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అదేవిధంగా జ్యోతిబా పూలే, బాబు జగ్జీవన్‌రామ్, సావిత్రిబాయి పూలే చిత్రపటాలను కూడా ఏర్పాటు చేసి వారి సేవలను స్మరించారు.కార్యక్రమంలో అన్నపురెడ్డిపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ లాకావత్ లక్ష్మి, ఉప సర్పంచ్ మార్గాని అశోక్, వార్డు సభ్యులు, పంచాయతీ సెక్రెటరీతో పాటు మండల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయం, సమానత్వం, హక్కుల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని తహసీల్దార్ గంటా ప్రతాప్ తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వ సేవలు వేగంగా చేరేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో వివక్షకు తావులేకుండా అందరూ ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు.ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేలా గ్రామపంచాయతీ తరఫున చర్యలు చేపడతామని సర్పంచ్ లాకావత్ లక్ష్మి తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రజల్లో మరింత అవగాహన పెంచుతాయని ఉప సర్పంచ్ మార్గాని అశోక్ పేర్కొన్నారు. చివరగా కార్యక్రమం సజావుగా ముగిసింది.

## నాణ్యతకు అధిక ప్రాధాన్యతనిస్తూ లక్ష్యాలు సాధించాలి

- రోజుకు 2.2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి
- 2.4 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరపాలి
- 15.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగింపు లక్ష్యంగా పనిచేయాలి
- ఏరియా జీఎంలకు సీఎండీ డి.కృష్ణ భాస్కర్ ఆదేశం





**కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 4 – ప్రజాజ్యోతి:** నిర్దేశిత లక్ష్యాల సాధనతో పాటు ముఖ్యంగా నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నాణ్యత గల బొగ్గును మాత్రమే వినియోగదారులు కోరుతున్నారని, ఈ దిశగా అన్ని రకాల చర్యలు తీసుకోవాల్సిందిగా సింగరేణి సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ డి. కృష్ణ భాస్కర్ అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లను ఆదేశించారు.మంగళవారం సాయంత్రం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి ఆయన బొగ్గు ఉత్పత్తి, రవాణా, నాణ్యత తదితర అంశాలపై సంస్థ డైరెక్టర్లు మరియు అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు బొగ్గు మార్కెట్లో వినియోగదారులు తమకు అవసరమైన నాణ్యత గల బొగ్గును మాత్రమే స్వీకరిస్తున్నారని, కనుక బొగ్గు పరిమాణం కన్నా బొగ్గు నాణ్యతా ప్రమాణాల పెంపుదలకు గట్టి చర్యలు తీసుకోవాలని ప్రతీ అధికారి, ఉద్యోగి ఈ దిశగా శ్రమిస్తేనే సంస్థకు భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు.ఈ ఏడాది పలు కారణాల వల్ల నెలవారీ ఉత్పత్తి లక్ష్యాల సాధనలో కొంత వెనుకబడి ఉన్నామని, అయినప్పటికీ ఈ ఆర్థిక సంవత్సరం చివరి వరకు ప్రతీ రోజూ కనీసం 2.20 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.40 లక్షల టన్నుల బొగ్గు రవాణా, 15.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగింపు లక్ష్యంగా పనిచేయాలన్నారు, ఈ కార్యక్రమంలో వివిధ ఏరియాల జనరల్ మేనేజర్లు తమ ఏరియాల్లో సాగుతున్న ఉత్పత్తి ప్రక్రియను వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్, ఫైనాన్స్) గౌతమ్ పొట్రు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం. తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్ మెంట్) బి. వెంకన్న, జీఎం (కో ఆర్డినేషన్ & మార్కెటింగ్) టి. శ్రీనివాస్, కార్పొరేట్ జీఎంలు, అన్ని ఏరియాల జీఎంలు, అధికారులు పాల్గొన్నారు.

## ఓ పార్టీలో ఉంటూ... స్వతంత్ర అభ్యర్థికి మద్దతా?

- 19వ వార్డులో ఆ పార్టీ నేత ముమ్మర ప్రచారం
- ఆ రాజకీయ పార్టీ నేతలు స్పందించరూ!

**ఇల్లందు, ఫిబ్రవరి 4, ప్రజాజ్యోతి:** రాజకీయాల్లో ఎవరు ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ అభిష్టం మేరకు పని చేయాల్సి ఉంటుంది. కానీ కొంతమంది పార్టీ విలువను మరిచి స్వతంత్ర అభ్యర్థికి మద్దత్తుగా ప్రచారం చేయడం ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మున్సిపల్ పరిధిలోని ఓ రాజకీయ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిని ఎన్నికల బరిలో నిలపడం జరిగింది. ఆ పార్టీకి చెందిన ఓ నేత వారికీ కాకుండా ఆ వార్డులో స్వతంత్ర అభ్యర్థి తరపున ప్రచారం కొనసాగిస్తూ వారికి ఓట్లు వేసి గెలిపించాలని కోరడం జరుగుతుందని సమాచారం. సదరు 19వ నేత ఎవరనేది రాజకీయ పార్టీలు గమనించి, కట్టడి చేయని పక్షంలో ఆ వార్డు కౌన్సిలర్ అభ్యర్థికి నష్టం జరిగే ప్రమాదం లేకపోలేదు. ఇలాంటి వారి పట్ల రాజకీయ పార్టీల అగ్ర నాయకులు పలు జాగ్రత్తలు వహించడం మంచిదని ఆ వార్డు ప్రజలు కోరుతున్నారు.

## రామాలయ అభివృద్ధికి సేకరించిన భూమి దేవస్థానానికి అప్పగింత



**భద్రాచలం, ఫిబ్రవరి 4,ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం రామాలయ అభివృద్ధి పనుల నిమిత్తం చేపట్టిన భూ సేకరణ ప్రక్రియను రెవెన్యూ అధికారులు పూర్తి చేశారు. ఈ క్రమంలో ఆలయ అభివృద్ధి కోసం సేకరించిన 33½ గుంటల భూమిని బుధవారం భద్రాచలం దేవస్థానం ఏఈవో భవానీరామకృష్ణకు తహసీల్దారు దనియాల వెంకటేశ్వర్లు అధికారికంగా అప్పగించారు.ఈ భూమిని ప్లాట్లుగా విభజించి, భూ నిర్వాసితులకు త్వరలో దేవస్థానం ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## దండు సారయ్య గెలుపుకై ఇంటింటి ప్రచారం





**ఇల్లందు, ఫిబ్రవరి 4, ప్రజాజ్యోతి:** మున్సిపల్ ఎన్నికల్లో ఐక్య కూటమి టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి శివశక్తి దండు సారయ్య (సారిక చౌదరి) గెలుపు కోసం బుధవారం మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ ఇంటింటి ప్రచారం ని ర్వహించారు. 13వ వార్డు ప్రజలు ఆలోచించి దండు సారయ్యకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇల్లందును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. ఇల్లందు మున్సిపాలిటీలో మరోసారి ఐక్య కూటమికి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందని తెలిపారు. గతంలో మున్సిపాలిటీలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉండేదని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లనే మిషన్ భగీరథ ద్వారా పట్టణ ప్రజలకు రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేయడం జరిగిందని గుర్తు చేశారు. బిఆర్ఎస్ నాయకులు సిలివేరు సత్యనారాయణ, జెకె శ్రీనివాస్, మౌనిక, నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## 3వ వార్డులో కాంగ్రెస్ ప్రచారం



**ఇల్లందు, ఫిబ్రవరి 4, ప్రజాజ్యోతి:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మూడవ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అజ్మీర వంశీని గెలిపించాలని కోరుతూ బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరిస్తూ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. వార్డు ప్రజలు ఆలోచించి అజ్మీర వంశీకి ఓట్లు వేసి గెలిపించాలన్నారు. ఇల్లందు మున్సిపాలిటీని మరింత అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి అజ్మీరా వంశీ, మాజీ వార్డు కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరరావు, నాయకులు వచ్చా వెంకన్న, నయీమ్, నల్లా శ్రీను, గుండంపల్లి సతీష్, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## 19వ వార్డు ప్రజలు ఆదరించండి



**ఇల్లందు, ఫిబ్రవరి 4, ప్రజాజ్యోతి:** మున్సిపల్ ఎన్నికల్లో 19వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా, మాజీ వార్డు కౌన్సిలర్ పత్తి స్వప్నను ఆదరించి గెలిపించాలని వార్డు ప్రజలను కోరారు. గత మున్సిపల్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి వార్డును ఎంతో అభివృద్ధి చేశానని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేశానని పత్తి స్వప్న తెలిపారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్య, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుల ఆశీర్వాదాలతో మరల 19వ వార్డు సిట్టింగ్ స్థానం నుండి ఎన్నికల బరిలో ఉన్నానని, వార్డు ప్రజలు ఆలోచించి చేతి గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వార్డు ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు.


## 7వ వార్డులో ముద్రగడ ముమ్మర ప్రచారం





**ఇల్లందు, ఫిబ్రవరి 4, ప్రజాజ్యోతి:** మున్సిపల్ ఎన్నికల్లో టిడిపి బలపరిచిన ఏడవ వార్డు స్వతంత్ర అభ్యర్థి ముద్రగడ వంశీ బుధవారం వార్డులో ముమ్మర ప్రచారం నిర్వహించారు. స్థానిక భజన మందిరం దేవాలయంలో కొబ్బరికాయ కొట్టి ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రతి ఇంటికి తిరుగుతూ కత్తెర గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. వార్డు అభివృద్ధిలో నిరంతరం పని చేస్తానని, ఏ సమస్య అయినా మీ ముందుకు వచ్చి పరిష్కరిస్తానని, మీ సహకారం అందించాలన్నారు. గత కొన్ని ఏళ్ల నుండి రాజకీయాల్లో ఉంటున్నానని, తన స్వార్థం కోసం రాజకీయాలు చేయడం లేదని, ప్రజలకు సేవ చేసేందుకేనని తెలిపారు. ప్రజలు ఆలోచించి తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. విజయలక్ష్మి నగర్ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు, టీడీపీ సీనియర్ నాయకులు శ్యామ్ తీవారి, కారు నర్సన్న, దాసరి గోపాలకృష్ణ, గోగేలా రాజేష్, ముక్కు శ్రీవెద్, బాసాని నవీన్, కుక్కల రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## ఐక్య కూటమి అభ్యర్థిని గెలిపించండి



**ఇల్లందు, ఫిబ్రవరి 4, ప్రజాజ్యోతి :** మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్, సిపిఐ, సీపీఎం, ప్రజాపంథా మాస్ లైన్ పార్టీల ఐక్య కూటమి 11వ వార్డు అభ్యర్థి అజ్మీర సత్యవతిని ప్రజలు ఆదరించాలని బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత పాలకవర్గం ఆధ్వర్యంలో ఇల్లందు మున్సిపాలిటీని అభివృద్ధి చేసిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనని నాయకులు పేర్కొన్నారు. మరోమారు ఐక్య కూటమిని మున్సిపల్ ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అభ్యర్థి అజ్మీర సత్యవతి, నాయకులు జెకె శ్రీనివాస్, లక్కినేని సురేందర్, భూక్యా దళ్ సింగ్ నాయక్, శ్రీను, కోమిరి సుందర్, కమటం చంద్రకళ, నాగేశ్వరరావు, సునేష్ నాయక్, ఆర్మీ రవి, ఐక్య కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# అవకాశం ఇవ్వండి....అభివృద్ధి చేస్తాం

- **మున్సిపల్ చైర్మన్ మన వాడైతే మీకు అన్ని పనులు చేసేందుకు సహకారం అందుతుంది**
- **రూ. 25కోట్లతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు... మరో 10 కోట్లకు ప్రతిపాదనలు**
- **కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేద్దాం.. ఎమ్మెల్యే జారే**



**అశ్వారావుపేట, ఫిబ్రవరి 04, ప్రజాజ్యోతి :** అశ్వారావుపేట మున్సిపల్ ఎన్నికలలో అభివృద్ధి చేసేందుకు ప్రజలు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వంలో తాను శాసన సభ్యుడిగా ఉన్నప్పుడు మున్సిపల్ చైర్మన్ తన వాడైతే అభివృద్ధిలో ఒకే మాటపై స్పష్టమైన ప్రణాళికతో వెళతామని అందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేస్తున్నామని ప్రజలు కూడా సహకరించాలని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని భద్రాచలం రోడ్ లో ఓ గార్డెన్ లో ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్ఎల్ఏ జారే ఆదినారాయణ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధిపై స్పష్టమైన విధానంతో ముందుకు వెళుతున్నామని ఇప్పటికే రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని రూ. 35 కోట్లకు ప్రతిపాదనలు పంపగా 10 కోట్లకు అనుమతి అనుమతులు పొం దామన్నారు. తనను ఆదరించి అత్యధిక మెజార్టీ ఇచ్చారని అలానే మున్సిపల్ లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులను కూడా ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. మున్సిపాలిటీలో ప్రతి రోడ్డును సిసి రహదారిగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, డ్రైన్ వ్యవస్థను కూడా పూర్తిగా ప్రక్షాళన చేస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పేదల కోసం జి ప్లస్ త్రీ భవనాలను నిర్మించి అవసరమైన ప్రతి పేదవారికి ఉచితంగా అందించనున్నామన్నారు. ఇప్పటికే 25 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, ఇండోర్ స్టేడియం, రింగ్ రోడ్ లో సీసీ రోడ్డు పనులకు రూ 8 కోట్లు ఆధునీకరణకు రూ. 5 కోట్లు, రూ. 8 కోట్లతో మున్సిపాలిటీ భవన నిర్మాణం రూ 1.5 కోట్లతో కూరగాయల మార్కెట్, వెజ్, నాన్ వెజ్ మార్కెట్ కాంప్లెక్స్ రూ. 50 లక్షలతో పబ్లిక్ టాయిలెట్ వంటి పనులు మొదలయ్యాయన్నారు. ఇంకా ఎంతో అభివృద్ధి చేయాలని అందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు జూపల్లి రమేష్, మండల అధ్యక్షులు తుమ్మ రాంబాబు, విజయ్ రెడ్డి, జూపల్లి ప్రమోద్, కాసాని పద్మశేఖర్, దుర్గా రావు, ఆకుల శ్రీను, చిన్నంశెట్టి యు గంధర్ , తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పేరు మార్చటం సరికాదు

- **సిపిఎం పార్టీ చర్ల మండల కార్యదర్శి మచ్చ రామారావు**



**చర్ల, ఫిబ్రవరి 04: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో బుధవారం సత్యనారాయణపురం గ్రామంలో జరుగుతున్న మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం గురుంచి సిపిఎం పార్టీ చర్ల మండల కార్యదర్శి మచ్చ రామారావు మాట్లాడుతూ మొదటగా మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మారుస్తున్నారని అది సరికాదని ఇదే పేరును కొనసాగించాలని ఆయన సూచించారు .పనిచేసే వారికి అందాల్సిన సౌకర్యాలు చెల్లించవలసిన అమౌంట్ మొత్తం చెల్లించాలని అని కోరారు .కార్పొరేట్ శక్తులు ప్రయోజనం కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ ఉపాధి హామీ చట్టాన్ని తీసివేయాలనే చూస్తుందని అని ఆయన మండిపడ్డారు. పనిముట్లు గుణపాలు ఇవ్వట్లేదు అని తట్టలు లేవు అని అలాగే మెడికల్ కిట్టు సరైన మంచినీళ్లు సౌకర్యం టెంటు సౌకర్యం కూడా సరిగ్గా లేదని అన్నారు . గ్రామంలో ఎప్పటికప్పుడు గ్రామ సభలు నిర్వహించి ఉపాధి హామీ పథకంలో ఉన్నటువంటి సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. గ్రామంలోని పేదలకు పని దొరక్కపోతే పెట్టుబడిదారులకు ప్రయోజకరంగా కలిగించే ఉద్దేశంతో ఉపయోగపడుతుంది అని ఆయన మండిపడ్డారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేర్లు మార్చితే కనుక ఎక్కడికక్కడికి మేము రాస్తారోకోలు ధర్నాలు చేయటానికి సిద్ధంగా ఉంటామని అన్నారు. అలాగే వంద రోజులు కాస్తా రెండు రోజులు చేయాలని పథకంలో భాగంగా కూలీ కనీసం 600 రూపాయలు ఇవ్వాలని ఈ కరువు ప్రాంతంలో బయట పనికి దొరకక ఈ ఉపాధి హామీ పథకం పనికొస్తే వంద రోజులు అవగానే మళ్లీ చేయటానికి వీల్లేదు అని కేంద్ర ప్రభుత్వాలు అంటున్నాయి అని అందుకుగాను కేంద్ర ప్రభుత్వాలు 200 రోజులు పెంచాలని కూలికి 600 రూపాయలు చొప్పున ఇవ్వాలని అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరరూ యధావిధిగా ఈ పథకాన్ని ఇలాగే కొనసాగించాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ సెక్రెటరీ కుర్సం నాగేశ్వరరావు. సోది లక్ష్మి నర్సు.ఉయిక లక్ష్మయ్య. ముద్ద రాజు గట్టుపల్లి కాంతయ్య ఇర్ప శంకర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## మావోయిస్టుల సామాగ్రి స్వాధీనం




**చర్ల, ఫిబ్రవరి 04: (ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ లో సోమవారం రహస్యంగా అందిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా, నారాయణపూర్ జిల్లా పరిధిలోని ఓర్చా పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని కంగాలి–మండోలి–అస్నార్–ఓర్చా అడవిలో నక్సలైట్లు దాచిపెట్టిన సామాగ్రి గురించి సమాచారం అందింది. సమాచారం ధృవీకరించబడిన తర్వాత నారాయణపూర్ పోలీసులు , ఐ టి బీ పీ 29వ బెటాలియన్ సంయుక్త బృందం శోధన ఆపరేషన్ ప్రారంభించింది. ఈ సోదాల్లో, నక్సలైట్లు ఉపయోగించిన వివిధ పదార్థాలను అటవీ ప్రాంతం నుండి స్వాధీనం చేసుకున్నారు. వాటిలో ప్రెషర్ కుక్కర్లు, తాళ్లు, విద్యుత్ వైర్లు, ఛార్జర్లు, బ్యాటరీలు, పెన్సిల్ సెల్స్, పైపులు, ఇంజిన్ ఆయిల్ రోజువారీ ఉపయోగించే ఇతర వస్తువులు ఐ ఈ డి ల తయారీకి సంబంధించిన పదార్థాలు ఉన్నాయి. ఈ పదార్థాలను స్వాధీనం చేసుకుని పంచనామా చేశారు. స్వాధీనం చేసుకున్న పదార్థాలను ఓర్చా పోలీస్ స్టేషన్కు సురక్షితంగా తీసుకువచ్చి సమర్పించారు. తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు అని నారాయణపూర్ పోలీసులు కేంద్ర దళాలు ఈ ప్రాంతంలో నక్సలైట్ వ్యతిరేక కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నాయి అన్నారు .

## మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



**టేకులపల్లి, ఫిబ్రవరి 04, ప్రజాజ్యోతి:** అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను టేకులపల్లి మండలంలోని బోడు పోలిసులు బుధవారం పట్టుకున్నారు. బోడు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం టేకులపల్లి మండలంలోని బోడు పోలిస్ స్టేషన్ పరిధి సంపత్ నగర్ సమీపంలో అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను బోడు పోలిసులు పట్టుకొని కేసు నమోదు చేశామని తెలిపారు. టేకులపల్లి తహసిల్దార్ లంకపల్లి వీరభద్రంకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- టికెట్లలో 'కొత్త ముఖాల' కటాక్షం
- ఏళ్లుగా పార్టీని నమ్ముకున్న వారికి దక్కని సీట్లు
- ఫిరాయింపు దారులకు ప్రాధాన్యం.. కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి




## కార్పొరేషన్ ఎన్నికలలో..

# కాంగ్రెస్ సిత్రాలు

(53 వ డివిజన్)

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ల కేటాయింపు రోజురోజుకీ వివాదాస్పదంగా మారుతోంది. సర్వే పేరిట ఆ పార్టీ నాయకులూ నడిపిన టికెట్ల కేటాయింపు స్క్రీన్ ప్లే తీరే ఇప్పుడు ఆ పార్టీ సిత్రాలను బయటపెడుతూ, కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తిని రగిలిస్తోంది. నిన్న ప్రచురితమైన "సర్వేనా.. స్క్రీన్ ప్లేనా..?" కథనానికి కొనసాగింపుగా.. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చోటుచేసుకున్న పరిణామాలు పార్టీ శ్రేణుల్లో తీవ్ర కలకలాన్ని రేపుతున్నాయి. ముఖ్యంగా ఏళ్ల తరబడి కాంగ్రెస్ ను నమ్ముకుని పనిచేసిన ఆశావహులను పక్కనపెట్టి, ఇటీవలే ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి టికెట్లు కేటాయించడమే ఇప్పుడు ప్రధాన అసంతృప్తికి కారణంగా మారింది.**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

### ››› 15 ఏళ్ల కార్యకర్తకు కాదని.. పిరాయింపుదారుడికే బీఫామ్

కొత్తగూడెం కార్పొరేషన్ లోని 53వ డివిజన్ లో జరిగిన పరిణామం ఇందుకు స్పష్టమైన ఉదాహరణగా నిలుస్తోంది. ఈ డివిజన్ కు కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ పొందిన పోతు పురుషోత్తం అనే అభ్యర్థి, కేవలం 15 రోజుల క్రితం వరకు సీపీఐ పార్టీలో ఉన్న వ్యక్తి. జనవరి 19న కాంగ్రెస్ జెండా కప్పుకున్న ఆయనకు అనూహ్యంగా బీఫామ్ దక్కడం పార్టీ శ్రేణుల్లో పెద్ద చర్చకు దారి తీసింది. అదే డివిజన్ లో గత 15 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న పల్లపు వెంకన్నకు మాత్రం ఈసారి కూడా అవకాశం దక్కలేదు. గత మున్సిపల్ ఎన్నికల్లో వెంకన్న 16వ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి, సుమారు రూ.17 లక్షల వరకు ఖర్చు చేసి ఓటమి పాలయ్యారు. ఆర్థికంగా తీవ్ర నష్టపోయినా, పార్టీని వీడకుండా కార్యకర్తగా కొనసాగుతూ, ప్రతి కార్యక్రమంలో ముందుండి పనిచేశారు. ఈసారి అయినా అవకాశం వస్తుందన్న ఆశతో ఉన్న ఆయనకు టికెట్ దక్కకపోవడం తీవ్ర నిరాశకు గురి చేసింది. దీనితో ఆయన అనుచరుల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది.

### ››› మరో ఇద్దరికి ఇదే దుస్థితి..

ఇదే డివిజన్ కు చెందిన మరో యువ నాయకుడు ముద్దంగుల మహేష్ పరిస్థితి కూడా ఇదే కోవలోకి వస్తోంది. ఎన్నేళ్లుగా కాంగ్రెస్ ను నమ్ముకుని పనిచేస్తున్న మహేష్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ లో చేరినప్పటి నుంచి ప్రజా గర్జన, పోడు యాత్ర వంటి కార్యక్రమాల్లో కీలకంగా పాల్గొన్నారు. పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా ఉన్నప్పటికీ, ఈసారి ఆయనకు కూడా సీటు దక్కలేదు. దీంతో నిరాశకు గురైన మహేష్ బీఆర్ఎస్ లో చేరి ఆ పార్టీ బీ–ఫామ్ తో బరిలోకి దిగారు. ఇంకొకవైపు, ఇక్కడి సిట్టింగ్ కౌన్సిలర్ మాదా శ్రీరాములు పరిస్థితి కూడా కాంగ్రెస్ లో ఏం జరుగుతోంది అన్న ప్రశ్నలకు బలం చేకూరుస్తోంది. ఆయన కాంగ్రెస్ తరపున నామినేషన్ దాఖలు చేసినప్పటికీ, అధిష్టానం నుంచి బీ–ఫామ్ మాత్రం ఇవ్వలేదు. అంతేకాదు, నామినేషన్ ఉపసంహరించుకోవాలని చెప్పేందుకు కూడా జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు నుంచి స్థానిక నాయకుల వరకూ ఒక్కరూ ముందుకు రాకపోవడం పార్టీలోని అంతర్గత వ్యవహారాలపై అనేక అనుమానాలకు తావిస్తోంది.

### ››› చేతివాటమే కీలకంగా..

పరిణామాలన్నింటినీ గమనిస్తే, పార్టీ కోసం ఏళ్లుగా పనిచేసిన నాయకులు, కార్యకర్తలు పక్కకు పోతుండగా, ఇటీవలే పార్టీలో చేరినవారికి టికెట్లు దక్కుతున్నాయన్న భావన బలపడుతోంది. "సర్వే" పేరుతో సీట్లు కేటాయించామని చెప్పినా, వాస్తవంగా సిఫారసులు, లోపాయికారీ ప్రయత్నాలు, చేతివాటమే కీలకంగా పనిచేశాయన్న ఆరోపణలు ఇప్పుడు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. 53వ డివిజన్ లో బీఫామ్ ఇప్పించేందుకు కూడా కొందరు స్థానిక నేతలు కీలక పాత్ర పోషించినట్టు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. "కాంగ్రెస్ ను నమ్ముకుని నిలబడితే చివరకు దక్కేది నిరాశేనా?" అన్న ప్రశ్న ఇప్పుడు కార్యకర్తల్లో బలంగా వినిపిస్తోంది. ఇది కేవలం ఒక డివిజన్ సమస్య కాదని, కొత్తగూడెం కార్పొరేషన్ వ్యాప్తంగా ఇదే అసంతృప్తి కనిపిస్తోందని పార్టీ శ్రేణులు అంటున్నాయి. నిన్న సర్వే పేరుతో స్క్రీన్ ప్లే రాజకీయాలపై విమర్శలు వెల్లువెత్తితే, ఈ రోజు ఫిరాయింపుదారులకు ప్రాధాన్యం ఇవ్వడంపై అసహనం మరింత బలపడింది. ఈ పరిణామాలన్నీ కలిసి, కాంగ్రెస్ పార్టీ టికెట్ల కేటాయింపుపై పెద్ద ప్రశ్నార్థకాన్ని నిలబెట్టాయి. ఈ అసంతృప్తి ఎన్నికల ప్రచారంలోనే కాకుండా, పోలింగ్ రోజున కూడా ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## అంగన్వాడి కేంద్రాలలో సామాజిక న్యాయ దినోత్సవం



**టేకుల ప ల్లి, ఫిబ్రవ రి0 4 , ప్రజాజ్యోతి:**సామాజిక న్యాయ దినోత్సవం జరుపుకుంటున్న శుభ సందర్భంలో అందరికీ సమాన హోదా,సమాన అవకాశాలు అనే అంశాన్ని సామాజిక ఆర్థిక విద్య ఉపాధి,రాజకీయకుల సర్వే తో పాటు సమాజంలో వెనుకబడిన ఆఖరికి వ్యక్తికి కూడా తగిన వనరులు సమకూర్చే దిశగా ముఖ్యమైన అడుగులు ప్రతి పౌరుడు భాగస్వామి అయ్యేలాగా మనమంతా ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేసుకుంటున్నాము. ఈ కార్యక్రమానికి శంబుని గూడెం సర్పంచ్ బట్టు శివ,అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## 22 వ డివిజన్ లో పోటాపోటీగా కార్పొరేట్ అభ్యర్థులు

- **22 వ డివిజన్ లో కార్పొరేట్ బి ఫామ్ లు అందుకున్న కాంగ్రెస్, బీజేపీ, బి ఆర్ ఎస్, స్వతంత్ర అభ్యర్థులు**



**సుజాత నగర్ ప్రజాజ్యోతి ఫిబ్రవరి 4:**మండలం లో కార్పొరేట్ ఎన్నిక లు మొదలు అయ్యాయి. సుజాత నగర్ 22 వ డివిజన్ కాగా, నాయకులగూడెం 21 వ డివిజన్ గా వుంది. సుజాత నగర్ లో 22 వ డివిజన్ లో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు, కాం గ్రెస్, బి ఆర్ ఎస్, బీజేపీ పోటీలో తలపడనున్నాయి. మొట్ట మొదటి సారి గా కార్పొరేట్ ఎన్నికలు కావడం వల న ఎప్పుడెప్పుడు ఓటు వేద్దామని ప్రజలు సంతోషం గా భావిస్తున్నారు. ఈ డివిజన్ లో ఎవరు గెలిచినా, గెలిచిన వారు ఈ డివిజన్ కి అభివృద్ధి అయ్యేలా చూ డాలని ప్రజలు కోరుకుంటున్నారు.ఈ డివిజన్ లో బి ఆర్ ఎస్ తరపున చింతలపూడి పార్వతి ( కారు గుర్తు ), కాంగ్రెస్ తరపున లింగం పుష్పావతి ( హస్తం గుర్తు ), బీజేపీ తరపున బొడ్డు పద్మావతీ (కమలం గుర్తు ), పెద్దమల్ల శోభారాణి స్వతంత్ర అభ్యర్థి ( ఆపిల్ గుర్తు ), గూని దుర్గ స్వతంత్ర అభ్యర్థి (ఎయిర్ కండిషనర్ గుర్తు ), కొల్లూరి రమ్య స్వతంత్ర అభ్యర్థి ( ఫుట్ బాల్ గుర్తు )గా వచ్చాయి.

## భద్రాచలంలో త్వరలో గిరి మార్ట్ ప్రారంభం

- **గిరిజనులు, ఎస్ హెచ్ జీ మహిళల ఉత్పత్తులు నేరుగా సేకరించాలి – ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్**



**భద్రాచలం,ఫిబ్రవరి 4,ప్రజాజ్యోతి :**ఆదివాసీ గిరిజనులు మరియు ప్రజల సౌకర్యార్థం, ఐటీడీఏ పీఓ బి. రాహుల్ ప్రత్యేక శ్రద్ధతో భద్రాచలం పట్టణంలోని గిరి బజార్ లో గిరి మార్ట్ ను త్వరలో ప్రారంభించనున్నట్లు ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ తెలిపారు. ఇందుకోసం సంబంధిత అధికారులు, జీసీసీ సేల్స్ మెన్ సహకారంతో గిరిజనులు మరియు ఎస్ హెచ్ జీ గ్రూప్ మహిళలు తయారు చేస్తున్న వివిధ రకాల గృహ అవసర వస్తువులను సేకరించాలని ఆయన సూచించారు.బుధవారం తన ఛాంబర్ నుంచి టెలికాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత ఐటీడీఏ స్పెషల్ ఆఫీసర్లు, జీసీసీ మేనేజర్లు, ఏపీఎంలు, డీపీఎంలు, సేల్స్ మెన్ లతో మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గృహ అవసరాలకు ఉపయోగపడే సేంద్రీయ విధానాలతో తయారైన ఆహార పదార్థాలను మండలాల వారీగా సేకరించాలని సూచించారు. గిరిజన రైతుల వద్ద లభించే బియ్యం, మక్కజొన్నలు, జొన్నలు, రాగులు, సజ్జలు, తదితర ధాన్యాలు, అలాగే మహిళలు తయారు చేసే పచ్చళ్ళు, ఇప్పపువ్వు లడ్డూలు, కరక్కాయ పౌడర్, కరక్కాయలు, తేనె, కారం, పసుపు, తృణధాన్యాలు తదితర ఉత్పత్తులు మధ్య దళారుల చేతుల్లోకి వెళ్లకుండా నేరుగా గిరి మార్ట్ కు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.సంబంధిత స్పెషల్ ఆఫీసర్లు, ఐకెపి ఏపీఎంలు, జీసీసీ మేనేజర్లు, సేల్స్ మెన్ లు తమ పరిధిలోని గ్రామస్తులు తయారు చేసే ఆహార పదార్థాలను పరిశీలించి, వాటికి సంబంధించిన వివరమైన నివేదికలను సకాలంలో సమర్పించాలని ఆయన ఆదేశించారు.ఈ టెలికాన్ఫరెన్స్ లో స్పెషల్ ఆఫీసర్లు, జీసీసీ మేనేజర్లు, డీపీఎంలు, ఏపీఎంలు, సేల్స్ మెన్ లు తదితరులు పాల్గొన్నారు.

# 25 ఏళ్ల తర్వాత పాల్వంచలో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందడి

- **ముగిసిన అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ, ఉపసంహరణ**
- **అభ్యర్థుల జాబితా ఖరారు కావడంతో ఎవరికి వారే హోరాహోరీగా ప్రారంభమైన ప్రచారాలు**
- **డివిజన్ల వారీగా మారు మోగుతున్న డప్పు , మైకులతో ప్రచారం**
- **పోటీలో ఉన్న కార్పొరేటర్ల ఎన్నికల ఖర్చు నియమ నిబంధనలను అధికారులు అరికట్టేనా?**



**పాల్వంచ ఫిబ్రవరి 4 ప్రజా జ్యోతి** గత 25 సంవత్సరాలుగా పాల్వంచ ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు త్వరలో జరగనున్నాయి, నిన్న మొన్నటి వరకు పాల్వంచ మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయో, లేదో అని..ఎన్నికలకు సంబంధించి కోర్టులో కేసు పెండింగ్లో ఉందని గత అనేక సంవత్సరాల నుండి పాల్వంచలో ప్రచారం జరుగుతున్న విషయం అందరికీ తెలిసిందే, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత స్థానిక కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాత్రం పట్టు పట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వివిధ మంత్రుల తో మాట్లాడి ఎట్టకేలకు పాల్వంచకు ఎన్నికలు జరిగే విధంగా తెరపైకి తీసుకురావడంతో, కొత్తగూడెం మున్సిపాలిటీ ని కొత్తగూడెం కార్పొరేషన్ గా ఏర్పాటు చేసి, పాల్వంచకు మున్సిపల్ బదులు కార్పొరేషన్ ఎన్నికలు జరిగే విధంగా కృషి చేయడంతో పాల్వంచకు ఎన్నికలు జరుగుతుండటం తో పాల్వంచ ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. 25 సంవత్సరాల క్రితం పాల్వంచ మున్సిపల్ చైర్మన్ గా బన్సీలాల్ కొనసాగి పట్టణ ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేసి, పట్టణ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన విషయం ప్రజలకు తెలిసింది. బన్సీలాల్ చైర్మన్ పదవి ముగిసిన నాటి నుండీ నేటి వరకు పాల్వంచలో పాలకవర్గం లేక అభివృద్ధి ఆమడ దూరంలో ఉంటూ వస్తుంది. పాల్వంచ మున్సిపాలిటీ గా ఉన్నట్లయితే ఎన్నికలు జరిగి కౌన్సిలర్లుగా ఉండేవారు, కానీ నేడు కొత్తగూడెం కార్పొరేషన్ డివిజన్ గా ఆవిర్భవించడంతో పాల్వంచకు కార్పొరేషన్ కు జరిగే ఎన్నికలలో విజయం సాధించిన వాళ్లంతా కార్పోరేటర్లుగా అవుతారు. ఏది ఏమైనా పాల్వంచకు డివిజన్ స్థాయి కార్పొరేషన్ ఎన్నికలు ఖరారు కావడంతో అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ తోపాటు ఉపసంహరణ కూడ ముగిసి, అభ్యర్థుల జాబితా ఖరారు కావడంతో అభ్యర్థులు ఎవరికి వారే, వారి వారి పార్టీ గుర్తులతో, స్వతంత్ర అభ్యర్థులు వారికి కేటాయించిన గుర్తులతో డివిజన్ వారిగా, డప్పు వాయిద్యాలతో, మైకులతో విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈనెల 11న ఎన్నికల తేది సమీపిస్తుండటంతో, 27 డివిజన్లో బరిలో ఉన్న కార్పొరేటర్ల అభ్యర్థులు తమకే ఓటు వేసి గెలిపించాలని, తమను గెలిపిస్తే డివిజన్ ను అభివృద్ధి చేస్తామని, డివిజన్లో తమకు ఎలాంటి సమస్యలు ఉన్న పరిష్కరిస్తామంటూ, మౌలిక సదుపాయాలు కల్పిస్తామంటూ, ఓటర్లను కలుసుకొని అభ్యర్థిస్తున్నారు. ఇదిలా ఉండగా పోటీలో ఉన్న కొంత మంది అభ్యర్థులు గుట్టు చప్పుడు కాకుండా డబ్బు, మద్యం, చీరలు, ఇతర సామాగ్రిని పంపిణీ చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే విధంగా ప్రచారం కొనసాగిస్తున్నట్లు సమాచారం. స్వతంత్ర అభ్యర్థులు మాత్రం నిశ్శబ్దంగా చాప కింద నీరులా తమకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేస్తుండటం కనిపిస్తుంది. ఇది ఇలా ఉండగా బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల ఖర్చు ఎంత చేయాలి ? ఎన్నికల నిబంధనలను పోటీలో ఉన్న అభ్యర్థులు ఏ మేరకు పాటిస్తున్నారు? వారు నియమ, నిబంధనలను ఉల్లంఘిస్తున్నారా లేదా అనే విషయం ఎన్నికల అధికారులు, పోలీస్, రెవిన్యూ పరిశీలించాల్సి ఉంది.

## పాల్వంచకు పండుగొచ్చింది

- **ఎవరెన్ని కుట్రలు చేసినా కార్పోరేషన్ ఎన్నికలను అడ్డుకోలేరు**
- **సిపిఐ అభ్యర్థులను ఆశీర్వదించండి**
- **ఆరునూరైనా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి తీరుతా**
- **కార్పోరేషన్ ఎన్నికల ప్రచారంలో కూనంనేని**





**పాల్వంచ ఫిబ్రవరి 4, ప్రజా జ్యోతి:**కొందరు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పాతికేళ్లుగా పాల్వంచలో స్థానిక ఎన్నికలు లేకుండా చేశారు. కార్పోరేషన్ చేసుకున్న తర్వాత కూడా ఎన్నికలను అడ్డుకోవాలని చూస్తున్నారని. ఎవరి ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఎన్నికలను ఆచడం ఎవరి తరం కాదు... ఈ ఎన్నికల వాతావరణంతో పాల్వంచకు పండుగొచ్చినట్లుగా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్పోరేషన్ ఎన్నికల సందర్భంగా బుధవారం ఆయన పాల్వంచ పరిధిలోని 35, 39, 42,46,47 డివిజన్లలో విస్తృత ప్రచారం చేశారు. తొలుత 42వ డివిజన్లో టిడిపి అభ్యర్థి గుత్తా వెంకట కృష్ణారావు ఎన్నికల కార్యాలయం, 46,47 డివిజన్ల సిపిఐ అభ్యర్థులు గుర్రం వెంకటేశ్వర్లు, మహ్మద్ జిలానీ బేగంలతో కలిసి పాత పాల్వంచ సెంటర్ ఎన్నికల కార్యాలయాన్ని కూనంనేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టడంతో పాటు మహిళలు పెద్ద ఎత్తున ఎదురేగి స్వాగతం పలుకుతూ హారతులు ఇచ్చారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ ఎంతో కాలంతర్వాత పాల్వంచ ప్రజల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని, సిపిఐ అభ్యర్థులను ఆశీర్వదించేందుకు వచ్చిన ప్రజలను చూస్తుంటే సారలమ్మ జాతరను తలపిస్తోందన్నారు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత కూడా ఎన్నికలను అడ్డుకోవాలని చూస్తున్నారని, కానీ కార్పోరేషన్ ఎన్నికలను అడ్డుకోవడం ఎవరితరం కాదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాటిచ్చిన ప్రకారం కొత్తగూడెం కార్పోరేషన్ తీసుకొచ్చానని, ఈ కార్పోరేషన్ ద్వారా ఈప్రాంత అభివృద్ధి శరవేగంగా సాగనుందన్నారు. ఎం ఎల్ ఏ గెలిచిన నాటి నుండి ఇప్పటి వరకు కోట్టాది రూపాయల నిధులను తీసుకొచ్చి మౌళిక సదుపాయల కల్పనకు పూనుకున్నామని, మారుమూల ప్రాంతాల్లో సహా డ్రైనేజీలు, సిసి రోడ్లు వేస్తున్నట్లు చెప్పారు. దేశంలోనే అత్యున్నత విద్యాలయం ఎర్త్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, 800 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటుకు పూనుకున్నామని, తద్వారా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. అంతే కాకుండా రూ.500 కోట్లతో పాల్వంచ మీదుగా రెండు బైపాస్ రోడ్లు త్వరలో వేయబోతున్నట్లు చెప్పారు. కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని, వారి గెలుపుతోనే ఈ ప్రాంతాభివృద్ధి పరుగులు పెట్టనుందన్నారు. పేదలకు అండగా ఉండేది ఎర్రజెండాలనే అని, కంకికొడవలి గుర్తుకు ఓటు వేయాలని తెలిపారు. ఈ ఎన్నికల్లో కొందరు డబ్బులు వెదజల్లి వ్యవస్థను చిన్నాభిన్నం చేసేందుకు చూస్తున్నారని, ప్రలోబాలకు గురిచేసిందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారని, దీనిని మీరంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 45వ డివిజన్ ప్రచారంలో భాగంగా గొల్లగూడెంలోని ఆయిల్ మిల్లులో సమావేశాన్ని నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు మచ్చ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ ఈ డివిజన్లో సౌమ్యుడైన అభ్యర్థి గౌతమి కృష్ణ (శివారమకృష్ణ)ని పోటీకి పెట్టామని, ఈ డివిజన్ ప్రజలంతా ఆయనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రాంతాలు, కులాలు, మతాల పేరుతో వైశమ్యాలు సృష్టించేందుకు కొందరు కుట్రలు మొదలేసారని, వారి ఉచ్చులో పడకుండా సమస్యలపై సమగ్ర అవగాహన కలిగిన విద్యావంతుడు గౌతమి కృష్ణను గెలిపించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అనంతరం 39వ వార్డు అభ్యర్థి మహ్మద్ అస్లామ్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. తొలుత అంబేద్కర్ సెంటర్లో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాదంతో కలిసి డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం సబ్ స్టేష్ రోడ్, చాకలి బజార్, టీచర్స్ కాలనీ, గాంధీ నగర్ తదితర కాలనీల్లో ప్రచారా సాగించారు. పాల్వంచలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పసుపు, ఎర్రజెండాలు రెపరెపలాడాయి. వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు, సన్నిహితులు ఆయా డివిజన్ల అభ్యర్థుల గెలుపుకోసం కదలి వచ్చారు.ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో సిపిఐ పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమిల్లి సాయిబాబా, వీశంశెట్టి పూర్ణచంద్రరావు, వైఎస్ గిరి, శనగారపు శ్రీనివాసరావు, వైవి వెంకట రామయ్య, పెద్ద వెంకట రామయ్య, మన్యం వెంకన్న, అన్నారపు వెంకటేశ్వర్లు, గౌస్, రెహమాన్, ఖరీమ్స్ మస్తాన్, అల్లి వెంకటేశ్వర్లు, సర్వయ్య, ఆదినారాయణ, కోరే కృష్ణ, టిడిపి నాయకులు కాపా కృష్ణ మోహన్, కళ్యాణం లక్ష్మీ పతి, రత్నాకర్, నల్లమల్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల ఆశయాలే సామాజిక న్యాయానికి మార్గదర్శకాలు

- **జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్**





**పాల్వంచ: ఫిబ్రవరి 4: ప్రజా జ్యోతి** మహనీయులు ప్రతిపాదించిన ఆశయాలు, సిద్ధాంతాలే సామాజిక న్యాయం సాధించేందుకు మార్గదర్శకాలని జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అన్నారు. తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు ముందుగా జాతిపిత మహాత్మ గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డా.. బి.ఆర్. అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటాలకు ఆయన పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ రంగాలలో సమానత్వం సాధించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎంతో కీలకమని అన్నారు. కుల సర్వే నిర్వహణతో పాటు షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సమాజంలోని వెనుకబడిన చివరి వ్యక్తికీ తగిన వనరులు, ప్రాతినిధ్యం, ఆత్మగౌరవం కల్పించేందుకు దోహదపడతాయని , సామాజిక న్యాయం సాధించాలంటే మహనీయులు చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు.అందరి అభ్యున్నతే లక్ష్యంగా మహాత్మ గాంధీ కలలు గన్న "సర్వోదయం" భావన, అణగారిన వర్గాల విద్య, గౌరవం కోసం మహాత్మ జ్యోతిరావు పూలే చేసిన పోరాటం, అలాగే భారత రాజ్యాంగ నిర్మాత డా..బి.ఆర్. అంబేద్కర్ బోధించిన సామాజిక ప్రజాస్వామ్య విలువలు ప్రతి పౌరునికీ నిరంతర ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు. ఈ విలువలను ఆచరణలోకి తీసుకువచ్చినప్పుడే సమానత్వం, న్యాయం సాకారమవుతాయని అన్నారు,అనంతరం తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు, సిబ్బందితో కలిసి సామూహిక ప్రతిజ్ఞ చేశారు. వివక్ష లేకుండా ప్రతి వ్యక్తిని గౌరవిస్తామని, సమానత్వం, న్యాయం , గౌరవం కోసం నిలబడతామని, ఏ రూపంలోనైనా అన్యాయాన్ని సమర్థించబోమని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి విజయలక్ష్మి, కలెక్టరేట్ పరిపాలనాధికారి అనంత రామకృష్ణ, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సంజీవరావు, జిల్లా సహకార శాఖ అధికారి ఎ. శ్రీనివాస్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, పౌరసరఫరాల శాఖ మేనేజర్ ఎస్. త్రినాథ్ బాబు, అన్ని శాఖల జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# టేకులపల్లి డెకరేషన్, లైటింగ్ సౌండ్ సిస్టం యూనియన్ ఎన్నిక

- **అధ్యక్షుడిగా గుమ్మడోజు తిరుపతి**



**టేకుల ప ల్లి, ఫిబ్రవ రి0 4 , ప్రజా జ్యోతి:** టేకులపల్లి మండల డెకరేషన్, లైటింగ్, సౌండ్ సిస్టం యూనియన్ ను బుధవారం మండల కేంద్రంలో ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. డెకరేషన్ యూనియన్ లో 88 మంది సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. యూనియన్ అధ్యక్షుడి గా గుమ్మడోజు తిరుపతి, ఉపాధ్యక్షుడిగా గుగులోత్ సురేందర్, ప్ర ధాన కార్యదర్శిగా ఈసం రాజేష్, కార్యదర్శిగా భూక్య కిషన్, కోశాధికారిగా ఊకే లక్ష్మయ్య, కార్యవర్గ సభ్యులుగా జాల మురళి, నల్లమాస శంకర్ గౌడ్, ధరవత్ లాలు, మాదే అనిల్ కుమార్, సిలివేరు శ్రీనివాస్, ధరవత్ సురేష్, భూక్య వెంకీ, కుమార్, దొడ్డ వెంకటేశ్వ ర్లును ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# టేకులపల్లిలో నేడు విద్యుత్ అంతరాయం

**టేకులపల్లి, ఫిబ్రవరి04, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని టేకులపల్లి, దాసుతండ, సింగ్యాతండ, లచ్చ్యతండ ఎ–కాలనీ, బి–కాలనీ పరిధిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టేకులపల్లి ఏఈ హాట్కర్ దేవా తెలిపారు. విద్యుత్ లైన్లు మరమ్మతుల వల్ల విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించగలరని ఆయన కోరారు.

# పాల్వంచలో 42, 3, 7 డివిజన్ స్వతంత్ర అభ్యర్థులకు సీపీఐ సంపూర్ణ మద్దతు

- **ఇల్లందు మాజీ ఎం ఎల్ ఏ గుమ్మడి నర్సయ్య**




**పాల్వంచ , ఫిబ్రవరి 4 ప్రజా జ్యోతి:** పాల్వంచలో స్తానిక ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి యు సి ఐ ) కార్యాలయం లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో పాల్వంచ లోనీ 42 డివిజన్ నుండి సి పి ఐ (ఎం ఎల్ ) మాస్ లైన్ పార్టీ అభ్యర్థినీ గా రాయభారపు దేవ కరుణ, అలాగే 3 డివిజన్, 7వ డివిజన్ ల నుండి స్వతంత్ర అభ్యర్థులు గా పోటీలో ఉన్న వారిని గెలిపించాలని ప్రజలను కోరారు. అధికారమే పరమావధిగా మేయర్ పీఠం కోసం అధికార ప్రతి పక్ష పాలక పార్టీలు డబ్బు సంచులతో ,మందు సీసాలతో హంగూ ఆర్భాటాలతో మళ్ళీ ప్రజలను వంచించి, అందలం కొంత మందిముందుకు వస్తున్నారన్నారు. తమ పార్టీ సి పి ఐ ఎం ఎల్ మాస్ లైన్ గత 60 ఏండ్లుగా ప్రజలకోసం బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం మౌలిక వసతులు కల్పించాలని, ప్రజలను చైతన్యం చేస్తూ వారి సమస్యల పరిష్కరించాలని ప్రభుత్వం పై రాజీలేని పోరాటాలు చేసిన చరిత్ర ఉన్నదని అన్నారు. ప్రజలకు సేవచేయలనే సంకల్పం, ఆ డివిజన్ లలో ఉన్న సమస్యల పట్ల స్పష్టమైన అవగాహన కలిగి ఆ సమస్యల పరిష్కారం కోసం నిస్వార్థంతో పనిచేయడానికి ముందుకు వచ్చి పోటీలో ఉన్న స్వతంత్ర అభ్యర్థులు వారీ గుర్తులు 42వ డివిజన్ లో కత్తెర గుర్తు, 3వ డివిజన్ బ్యాట్ గుర్తు 7వ డివిజన్ కత్తెర గుర్తులపై తమ అమూల్యమైన ఓటును వేసి గెలిపించగలరని ఆ డివిజన్ లలోని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.,సి పి ఐ (ఎం ఎల్ ) మాస్ లైన్ పార్టీ స్వతంత్ర అభ్యర్థులు గా పోటిలో ఉన్నా వీరు ప్రజల పక్షాన నిలబడి కొట్లాడే స్వాభావం, సామాజిక బాధ్యత, సేవా దృక్పథం ఇలాంటి నేపథ్యం కలిగిన అభ్యర్థులు పోటీలో ఉన్నారనే సి పి ఐ (ఎం ఎల్ ) మాస్ లైన్ పార్టీ తమ సంపూర్ణ మద్దతు ఇచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సి పి ఐ (ఎం ఎల్ ) మాస్ లైన్ పార్టీ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్, జిల్లా నాయకులు కల్లూరి కిషోర్, అభ్యర్థులు దేవ కరుణ, సుజాత, పట్టణ కార్యదర్శి రాయబారపు వెంకటేశ్వర్లు, టి యూ సి ఐ పాల్వంచ ఏరియా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గోనెల రమేష్, వేల్పుల రమేష్, కె భాస్కర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లింగ బసవేశ్వర స్వామి జాతర పోస్టర్ ఆవిష్కరణ



**టేకులపల్లి, ఫిబ్రవరి 04, ప్రజా జ్యోతి:** మండలంలోని కోయగూడెం పంచాయతీ ఇప్పలతండ గ్రామంలో శ్రీ లింగ బసవేశ్వర స్వామి జాతర మహోత్సవం, అలాగే మద్రాస్ తండా పంచాయతీ కొండంగుల బోడు వీరభద్ర స్వామి మహోత్సవ జాతర పోస్టర్లను కోయగూడెం మాజీ సర్పంచ్ కోరం ఉమా బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలోకోయగూడెం సర్పంచ్ కోరం సుభాష్ చంద్రబోస్, ఉత్సవ కమిటీ సభ్యులు ,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రచారంలో పాల్గొన్న రజాక్



**కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 4 – ప్రజాజ్యోతి:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకులు ఎంఏ రజాక్ అధ్వర్యంలో 24వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గొల్లపల్లి సత్యానంద్ (అశోక్) హస్తం గుర్తు పై తమ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజారిటీ తో గెలిపించాలని ఓటరు మహాశేయులను కోరడం జరిగింది. అదే విధముగా గురువారం ఉదయం 10 గంటలకు పోస్టాఫీసు సెంటర్ నుండి ఎన్నికల ప్రచారానికి విచ్చేస్తున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రచారానికి 24వ డివిజన్ నుండి కాంగ్రెస్ శ్రేణులు ఆదిక సంఖ్యలో పాల్గొనాలని కోరడం జరిగింది.

# మున్సిపాలిటీ అభివృద్ధి కాంగ్రెస్ తోనే

- **కాంగ్రెస్ అభ్యర్థులను ఆదరించి గెలిపించండి**



**ఇల్లందు, ఫిబ్రవరి 4, ప్రజాజ్యోతి:** ఇల్లందు మున్సిపాలిటీ మరింతగా అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం 5,6,7,8,9 వార్డులలో ఎమ్మెల్యే ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమలు చేయడం జరిగిందన్నారు. అన్ని వర్గాలను దుష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలియదని, హామీ ఇచ్చిన పథకాలను అమలు చేసి ప్రజల దరికి చేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఇల్లందు నియోజకవర్గంలో పాటు మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ. కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని, ఇందిరమ్మ ఇండ్లను మరో మూడు దఫాలుగా ప్రతి ఒక్క పేదలకు అందించడమేనని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రజలు ఆదరించి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోరం సురేందర్, మండల రాము, భోళ్ల సూర్యం, సర్పంచులు, నాయకులు బండి ఆనంద్, కాకటి భార్గవ్, దండుగుల శివ, ఈసం లక్ష్మణ్, ప్రసన్న కుమార్ యాదవ్, కార్యకర్తలు, ఆయా వార్డుల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## ఓణీల అలంకరణ వేడుకకు హాజరైన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య



**దమ్మపేట,ఫిబ్రవరి.04,(ప్రజా జ్యోతి):** దమ్మపేట మండలం, చిల్లగుంపు గ్రామానికి చెందిన బొగ్గం రాము మనవరాలు ఓణీల అలంకరణ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఇల్లందు మాజీ శాసనసభ్యులు గుమ్మడి నరసయ్య హాజరై చిన్నారిని ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకలో మాజీ జెడ్పిటిసి వెంకటేశ్వరరావు, కోయ్యల అచ్యుత రావు, బొల్లికొండ ప్రభాకర్, బొజ్జ రమేష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ సంప్రదాయాలు, సంస్కృతి నిలుపుకోవడంలో ఇలాంటి వేడుకల ప్రాధాన్యత ఎంతో ఉందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభకార్యాన్ని విజయవంతం చేశారు.

## 19వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి ప్రచారం



**ఇల్లందు, ఫిబ్రవరి 4, ప్రజాజ్యోతి:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఐక్య కూటమి 19వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి పింగళి అనూహ్య బుధవారం వార్డులో ప్రచారం నిర్వహించారు. వార్డు ప్రజలు ఐక్య కూటమి బిఆర్ఎస్ అభ్యర్థి అయిన తనను ఆదరించి గెలిపించాలని కోరారు. తనను వార్డు కౌన్సిలర్ గా గెలిపిస్తే వార్డులో సమస్యలను పరిష్కరిస్తానని, వార్డు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఇల్లందు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిపిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. వార్డు ప్రజలు ఆలోచించి కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకుడు పింగళి నరేష్,కోరారు. ఈ కార్యక్రమంలో పింగళి నరేష్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## సున్నం రాములు మృతి పట్ల నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా





**దమ్మపేట,ఫిబ్రవరి.04,(ప్రజా జ్యోతి):** ములకలపల్లి మాజీ జెడ్పీటీసీ సున్నం నాగమణి మామ, దమ్మపేట మండలం తాళ్ళమడ గ్రామానికి చెందిన సున్నం రాములు (రామలక్ష్మయ్య) స్వర్గస్థులైన విషయం తెలుసుకున్న అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు వారి పార్థివదేహానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రూప్ సింగ్, మురళి, మండవ సత్య, అశోక్, మురళి తదితరులు మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబానికి దేవుడు మనోధైర్యం ప్రసాదించాలని వారు ఆకాంక్షించారు.

# అతివేగానికి అదుపు....ఆ నలుగురు

- **వారుండగా ట్రా"ఫికర్ "**
- **అడుగడుగునా అంకిత భావం**









**మితిమీరిన వేగానికి కళ్లెం వేసి, అలుపెరగని విధులతో ప్రమాదాల నివారణకై పరితపిస్తూ అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న ఆ నలుగురు రక్షక భటులు అందరి మన్ననలు పొందుతూ భద్రాద్రి ట్రాఫిక్‌కు దిశానిర్దేశంగా మారారు. ఉన్నతాధికారుల మార్గదర్శకాలను నలుమూలలా అమలు చేస్తూ వారు నిర్వహిస్తున్న విధులు వాహనదారుల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయి. భద్రాచలం ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న ఆ నలుగురు రక్షక భటుల అంకితభావంపై ప్రజాజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.**

**భద్రాచలం, ఫిబ్రవరి 4 (ప్రజాజ్యోతి):** దినదినాభివృద్ధి చెందుతున్న పట్టణం భద్రాచలం. శ్రీరాముడి ఆశీస్సులతో పెరుగుతున్న భక్తుల రద్దీ భద్రాచలాన్ని నిండు కుండలా మారుస్తున్నప్పటికీ, అదే స్థాయిలో ట్రాఫిక్ సమస్య కూడా పెరుగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో భద్రాచలం ట్రాఫిక్ పోలీసులు చేపడుతున్న అంకితభావ విధులు రోడ్డు ప్రమాదాల నివారణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.గతంలో ట్రాఫిక్ నియంత్రణలో పనిచేసిన యస్ఐలు అబ్బయ్య, సురేష్‌ల పనితీరుకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రస్తుత బాధ్యతల్లో ఉన్న యస్ఐ తిరుపతి రావు పర్యవేక్షణలో పనిచేస్తున్న ఆ నలుగురు రక్షక భటులు భద్రాద్రి ట్రాఫిక్ అదుపుకు కేంద్రబిందువుగా మారారు.

ఏజెన్సీ మండలాల నుంచి ప్రతిరోజూ వచ్చే వాహనాల రాకపోకలపై ప్రత్యేక దృష్టి సారించి ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు వారు చేస్తున్న ప్రయత్నాలు విశేషంగా నిలుస్తున్నాయి.భద్రాచలంలోని ప్రధాన కూడళ్లైన అంబేద్కర్ సెంటర్, యూబీ రోడ్, మార్కెట్ సెంటర్, ఫారెస్ట్ చెక్‌పోస్ట్, బస్టాండ్ సెంటర్‌లలో విధులు నిర్వహిస్తున్న చవ్వాకుల రాంబాబు, ముత్యాల రమేష్‌లతో పాటు ఏఎస్ఐ మోతుకూరి శంకర్, హెడ్ కానిస్టేబుల్ షేక్ అబ్దుల్ షమీన్‌లు పారదర్శక విధులతో ప్రమాదాల నివారణకు చిరునామాగా మారారు.గతంతో పోలిస్తే కఠినమైన ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేని ఎందరో మన్యం వాసులు ప్రతిరోజూ పట్టణానికి వచ్చి వెళ్తుంటారు. ఈ క్రమంలో శిరస్త్రాణం ధరించని వాహనదారులను, అతివేగంగా వాహనాలు నడిపే యువతను గుర్తించి ముందస్తుగా అవగాహన కల్పిస్తూ, అవసరమైతే జరిమానాలు విధిస్తూ ట్రాఫిక్ నియంత్రణలో ముందు వరుసలో నిలుస్తున్నారు.ప్రధానంగా రామాలయానికి వచ్చే భక్తుల్లో వృద్ధులు, వికలాంగులు అధికంగా ఉండటంతో వారు రహదారులు దాటే సమయంలో ప్రమాదాలు జరగకుండా ప్రధాన కూడళ్లలో వీరు నిర్వహిస్తున్న విధులు అందరి ప్రశంసలను పొందుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు మండు ఎండ అయినా, గాలి–వాన అయినా, పెను తుఫాన్ అయినా పట్టించుకోకుండా నిలబడి విధులు నిర్వహిస్తున్న ఆ రక్షక భటుల కృషితో ప్రమాదాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి.

### కష్టాన్ని మరిచి... అవగాహన పెంచుతూ...

పోలీస్ స్టేషన్‌లో విధుల నిర్వహణ కంటే ట్రాఫిక్ విధులు మరింత కష్టతరంగా మారాయని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిలబడి, వాతావరణ కాలుష్యాన్ని సైతం తట్టుకుంటూ వారు చేస్తున్న విధుల్లో ఆత్మసంతృప్తి కనిపిస్తుందని తెలిపారు. ప్రారంభ దశలో వాహనదారుల అవగాహన లోపంతో ప్రమాదాలు ఎక్కువగా జరిగేవని, ప్రస్తుతం ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు.చవ్వాకుల రాంబాబు 1995 బ్యాచ్‌కు చెందిన వారు. ప్రథమ పోస్టింగ్ భద్రాచలమే. అప్పటి నుంచి వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేసి ప్రస్తుతం ట్రాఫిక్ విభాగంలో అలుపెరగని విధులు నిర్వహిస్తున్నారు. ముత్యాల రమేష్ 2010 బ్యాచ్‌కు చెందినవారు. మోతుగూడెంలో తొలి పోస్టింగ్ పొందిన ఆయన వివిధ స్టేషన్లలో పనిచేసి ప్రస్తుతం భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు తనదైన ముద్ర వేస్తున్నారు.ఏఎస్ఐ మోతుకూరి శంకర్ 1989 బ్యాచ్‌కు చెందినవారు. ప్రథమ పోస్టింగ్ నుంచి వివిధ పోలీస్ స్టేషన్లలో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రస్తుతం భద్రాద్రి ట్రాఫిక్‌లో చిరునవ్వే చిరునామాగా కొనసాగుతున్నారు. హెడ్ కానిస్టేబుల్ షేక్ అబ్దుల్ షమీన్ ఖమ్మంలో తొలి పోస్టింగ్‌తో విధులు ప్రారంభించి, వివిధ స్టేషన్లలో పనిచేసి ప్రస్తుతం భద్రాచలం ట్రాఫిక్ ప్రమాదాల నివారణకు తన వంతు కృషి చేస్తున్నారు.

ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ, కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాల్సి వచ్చినా, వారు చేస్తున్న అంకితభావ విధులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయి. యస్ఐ తిరుపతి రావు ఆదేశాలతో ప్రతిరోజూ విధులు నిర్వహిస్తున్న ఈ రక్షక భటులు భద్రాద్రి వాహనదారుల రక్షణ కోసం ఆ నలుగురుగా నిలువెత్తు రక్షకులుగా నిలుస్తున్నారు.

## సేవా మార్గంలో తుమ్మల యుగంధర్ జన్మదిన వేడుకలు

- **అభిమానులు ఆద్వర్యంలో గండుగులపల్లిలో ఘనంగా వేడుకలు**
- **యుగంధర్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు 22 రోజుల అల్పాహారం**

**దమ్మపేట,ఫిబ్రవరి.04,(ప్రజా జ్యోతి)** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుటుంబంపై ప్రజల్లో ఉన్న విశ్వాసం, అభిమానాన్ని మరోసారి చాటేలా... ఆయన తనయుడు తుమ్మల యుగంధర్ జన్మదినాన్ని పురస్కరించుకుని అభిమానులు రాజకీయ ప్రచారానికి అతీతంగా సేవా మార్గాన్ని ఎంచుకున్నారు. నాయకత్వం అంటే పదవులు కాదు–ప్రజల జీవితాల్లో ఉపయోగపడే పనులే అన్న సందేశాన్ని ఈ కార్యక్రమం స్పష్టంగా వెల్లడించింది.మంత్రి స్వగ్రామమైన గండుగులపల్లిలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో, పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికరమైన అల్పాహారం అందజేశారు. చదువే భవిష్యత్తు, విద్యార్థులే రాష్ట్రానికి మూలస్తంభాలు అన్న దృక్పథంతో, గండుగులపల్లి జిల్లా పరిషత్ పాటశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ఈ సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ... ప్రజాసేవను రాజకీయాల హృదయంగా భావించే తుమ్మల కుటుంబ పరంపర కొనసాగాలని ఆకాంక్షిస్తూ, యుగంధర్ గారు తన తండ్రి అడుగుజాడల్లో నడిచి ప్రజలకు అండగా నిలవాలని కోరుకుంటూ ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా, వరుసగా 22 రోజుల పాటు పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించే బాధ్యతను అభిమానులు స్వయంగా తీసుకున్నారు.జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు పరిమితం చేయకుండా, విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడే కార్యక్రమాలుగా మలిచిన ఈ చర్యకు స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. పాఠశాల ఆవరణలో కేక్ కట్ చేసి తుమ్మల యుగంధర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొయ్యల అచ్యుతరావు, పైడి వెంకటేశ్వరరావు, యర్రా వసంతరావు, కే.వి. సత్యనారాయణ, కాసాని నాగప్రసాద్, పైడి సాయి, గండుగులపల్లి గ్రామ పెద్దలు, తుమ్మల యువసేన సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజాసేవే రాజకీయాలకు నిజమైన బలం అన్న నమ్మకాన్ని ఈ కార్యక్రమం మరోసారి రుజువు చేసిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

